స్కెచ్

# చీలిపోయిన దారులు

కె. రామలక్ష్మి

"నిజంగానే అంటున్నావా?" అన్నాడు అతను,—"లేకుంటే నన్ను భయపెట్ట డానికా?"

"నిజంగానే" అంది ఆమె.

ఈ సంభాషణంతా అల్పాహారం తింటూను. యువతి అందంగా వుంది. లోపల విచారంగా వున్నా, పైకి ఏదో చిలిపితనం చూపే మానసిక స్థితిలోవుంది. ఈ మానసిక స్థితికి ఆ యువకుడే కారణమేమో! చిరునవ్వు నవ్వుతున్నాడు.

బాగా చీకటిపడిపోయింది.

"అయితే నువ్వాలా అనుకుందుకు తగిన ఆధారం వుందన్నమాట?" క్రాస్ ఎగ్జామిన్ చేసే ప్లీడరువలె తలూపుతూ అడిగాడు.

"ఉంది" అతనిలాగే తలూపింది.

"బహుశా నన్ను పోలిన వాడెవడేనా అయి వుంటాడేమో?"

"అదేం కాదు. నా దృష్టిలో నిన్ను పోలిన వాడివి నువ్వే."

"అయితే, నిన్నరాత్రి నన్ను చూశానం టావు?"

"ఆ"

"నిన్న నీతోనే వున్నానటే", అన్నాడు.

"ఉట్టినే అలా అంటున్నావు."

"లేదు లేదు నిజంగానే!"

"నాతో కూడా లేవు నిన్నరాత్రి" అంది ఆమె.

"నువ్వు ఊహించుకున్న నన్నూ ఆ పిల్లనీ ఎక్కడ చూశావు?"

"ఎక్కడో నీకు తెలియదా? మనిద్దరం సాధారణంగా వెళ్ళేచోట్లోనే!"

"ఓ అక్కడా-కొంచం జ్ఞాపకం తెచ్చుకోనీ. అక్కడ ఓ అందమైన అమ్మాయితో నేనా? అసంభవం!" అన్నాడు నటుడివలె. అంతే కాదు. "అబద్ధం" అన్నట్టు తలూపాడు అడ్డంగా. "నువ్వు చూసింది నన్నుమటుకు కాదు" అన్నాడు అదే ఖచ్చితం అయినట్లు.

"నే చూస్తేనే."

"సరే. అయితే ఏమైంది?" అన్నాడు కొంచెం విసుగ్గా.

"ఏం జరిగిందో నీకు తెలియదు కాబోలు?"

"ఒట్టు, నాకేం జ్ఞాపకం లేదు."

"సరే అయితే, ఏదో ఒళ్లు తెలియని పరిస్థి తిలో ఉన్నావు" అంది ఆమె—చాలా సీరియ స్‌గా.

"అంతా అబద్ధం."

"అయితే నీకేమైనా జ్ఞాపకం వుందా?"

"ఇదుగో యిటువిను, నిన్నరాత్రిపదుతూంటే నీతో నేవున్నట్టు నాకు జ్ఞాపకం; దేన్నిగురించో తర్కించాం. మనకదేమీ కొత్తకాదుగా? దీనికి కారణం నిన్ను నేనూ, బహుశా నన్ను నువ్వూ ప్రేమించడం చేతనేమో! నీ సంగతి నాకు తెలియదుకాని, నిన్ను నేను ప్రేమిస్తు న్నాను. నిన్నరాత్రి ఎవరితో నైనా నేను ఉన్నట్లయితే అది నీతోనే. అక్కడ కాదు సరి కదా మరెక్కడైనా సరే మువ్వాటికీ నిన్నచీక టడుతుంటే నీతోనే వున్నా."...

"ఏం అలా అన్నావు?" అన్నాడు ఆత్రు తతో.

"నువ్వు నన్ను మన్నించవ్వూ?" ఎంతో ప్రాధేయ పడ్డట్టు అడిగింది ఆమె.

"దేన్ని గురించి!"

"నా చిలిపి ప్రవర్తన గురించి."

"నీకంటె అసహ్యంగా ప్రవర్తించానే నేను, నాకేం చిన్నతనంగా లేదే!" అన్నాడు.

"అంతే కాకుండా, నాకుసంతోషంగాకూడా వుంది."

"ఇటు నాడు, పొద్దుట లేచినదగ్గరనుంచి ఎంతో బాధగా వుంది లోపల. నీతో వున్నది

నేనేనని నమ్మలేక పోయాను. ఏదేదో అన్నాను కదూ!" అంది చిన్నపోయిన స్వరంతో.

"నువ్వేమన్నావో తెలుసా? స్వార్థపరుణ్ణి అన్నావు. గర్వపోతునన్నావు. మొరటువాణ్ణి అన్నావు. అన్న దాన్ని గురించి ఎందుకు బాధపడ్డం? చూడు నిజంగానే, నేను గర్వపోతునీ, స్వార్థపరుణ్ణీ మొరటువాణ్ణీకూడా."...

"ప్రేమించడం అదోరకం పిచ్చి." అన్నాడతను. "రెండు మూడేళ్ళపాటు ఎక్కడికేనా పోదామని అనుకోలేదూ నువ్వు? త్వరలోనే నిజంగా పెళ్లిచేసుకుందామని ప్లేను వెయ్యడం లేదూ?" అని ప్రశ్నించాడు. అనుకోకుండానే అమ్మాయి ఆలోచనలో మునిగిపోయింది. ఎందుకో, ఆ రోజు కూర్చున్న దగ్గర్నుంచి, ఆలోచనలోనేవుంది. ఇప్పుడు ద్వంద్వ ప్రవర్తనకూడా ఆమెకి సాధ్యంలోలేదు. అందుకే మొదట్లోవలె వేళాకోళంగా ఉందామని ప్రయత్నించినా ఉండలేకపోయింది.

"నేను నిజంగా వెళ్ళిపోవాలనివుందా నీకు" అడిగింది ఆమె. "చూడు, నీకేది యిష్టమైతే అది నేను చెయ్యగలను, తెలుసా?"

"నిజంగానే నన్ను నిజంచెప్పెయ్యమన్నావా" అడిగాడు అతను.

"ఊఁ."

"సరే. అవును. నువ్వు నిజంగా వెళ్లిపోవాలనే వుంది నాకు. మళ్ళీ మొరటుగా ప్రవర్తిస్తున్నాను కదూ? నువ్వు నిజంగానే వెళ్లిపో. చూడు, నువ్వు వెళ్ళిపోతే నువ్వెక్కడికెళ్ళావో కనుక్కుని, నేనూ వెతుక్కుంటూ అక్కడికే వస్తాను. దాని అంతరార్థం తెలుకో కలిగితే తెలుసుకో. ఒకసారి కాదు. అస్తమానం చెప్పకలను, నేను నిన్ను ప్రేమిస్తున్నానని". "నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను. అందుకే నిన్ను వదలి అసలు పోలేను. రోజూ నిన్ను ఒక్క సారేనా చూడకపోతే నా ప్రాణం నిలవదు. నిజమే, ఆడవాళ్ళు యిలాంటి మాటలు తరుచు చెప్తాంటారు. వాళ్ళమాటలు నేనెప్పుడూ నమ్మలేకపోయేదాన్ని. ఇప్పుడు తెలుస్తోంది వారే అంతరార్థంతో అనేవారో!" అంది. ఆ కంఠస్వరంలో ప్రేమ, దయ, యింకా ఏమేమిటో వుట్టిపడేలా.

"అదోరకం పిచ్చే అయినా, నువ్వు ఒప్పుకుంటావన్నమాట" అన్నాడు అతను గాంభీర్యంగా.

"ఆఁ. తప్పకుండా."

"అన్నిటికంటె దారుణం, ఇటు విను. ఏమిటో నిన్ను పెళ్ళిచేసుకోవాలని అనిపిస్తోంది నాకు."

"నువ్వలా అంటే నాకేదో గర్వంగావుంది" అంది ఆమె. "నాకూ అలాగే తోస్తోందిసుమీ!"

"చూడు, యిలాంటి ఆలోచనలు మనల్ని ఏదరీ చేర్చవు" అన్నాడు విచారంగా.

"మనం పెళ్లాడుతాం. ఎక్కడో చక్కని ఓ చిన్న యిల్లు తీసుకుంటాం. నువ్వెప్పుడూ నన్ను చూస్తూ ఉంటావు. నేనెప్పుడూ నిన్ను చూస్తాంటాను. అయిదారు రోజుల తరువాత యీ సన్నిహితంలో అంత ఆనందము ఉండకపోవచ్చు—ఏమో! విసుగ్గా కూడా వుంటుందని తోస్తుంది నాకు" అన్నాడు వేదాంతిలా.

"అసహ్యం వేస్తుందేమో కూడా" అంది ఆమె.

"ఏమో, అలాగే అవొచ్చు" అన్నాడతను.

"తరువాత, ఓ సుముహూర్తాన అందరి భార్యల లాగే నా దగ్గరకి చేరి నువ్వూ ఏదో చెప్పడానికి వస్తావు. అయ్య బాబోయ్" అన్నాడతను. తనను రక్షించేవారు లేరా అన్నట్టు.

"ఇదంతా తలుచుకుంటే భయంగా లేదూ?" అంది ఆమె.

"భయమా! యింకేమేనానా? అందరి భార్యల్లాగే నువ్వూ వచ్చి అలా చెప్పిననాడు— తక్షణం అవతలకి వెళ్లిపోయి చాలామంచివాణ్ణయిపోతాను. చూడూ, యిదంతా అనవసరంగా తోస్తుంది. దాన్ని గురించి మళ్ళీ రెండోసారి ఆలోచన రానీకు" అన్నాడు బడిపంతులు విద్యార్థికి నీతి బోధించినట్లు.

అంతే. ఇద్దరూ లేచారు. అనుకున్న దాన్ని అమల్లో పెట్టే ప్రయత్నంలో వారు పెళ్లిని గురించి మళ్ళీ ఆలోచన రానీయలేదు.